క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

బంధువులకు అనాథల అప్పగింత



అనాథలను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: రోడ్డుపై భిక్షాటన చేస్తున్న ఇద్దరిని పెందుర్తి పోలీసులు వారి బంధువులకు అప్పగించారు. వివరాలివి.. సీపీ ఆదేశాల మేరకు ఇటీవల పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మద్దిలపాలెంలో రోడ్డుపై భిక్షాటన చేస్తున్న రాహుల్‌నాయక్(35), మురళిరాహుల్(45)ను తీసుకువచ్చి సీఐ కె.వి.సతీష్‌కుమార్ చొరవతో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఈ క్రమంలో వారి బంధువులు కర్ణాటకలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని పెందుర్తి పిలిపించి శుక్రవారం వారికి ఈ ఇద్దరిని అప్పగించారు.

అప్పన్నను దర్శించుకున్న సతీష్‌రెడ్డి



సతీష్‌రెడ్డికి ప్రసాదం అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి.సతీష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామివారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం ఏఈవో తిరుమలేశ్వరరావు అందజేశారు.

పెందుర్తిలో ఐఏఎస్ అధికారి కృష్ణతేజ



డీపీఆర్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న కృష్ణతేజ

పెందుర్తి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ, ఐఏఎస్ అధికారి ఎం.కృష్ణతేజ శుక్రవారం పెందుర్తిలో పర్యటించారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్న డీపీఆర్‌సీ భవనాన్ని పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజయ్యపేట పంచాయతీలో పర్యటించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఆ రెండు స్టేషన్లలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: దువ్వాడ, సింహాచలం రైల్వేస్టేషన్లను సబర్బన్‌గా పరిగణించి అన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ ప్రతిపాదనలు చేశారు. భువనేశ్వర్‌లో శుక్రవారం తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దువ్వాడ రైల్వేస్టేషన్, విశాఖ మహానగర స్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. విశాఖ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వంటి నగరాలకు రోజు రాత్రి ప్రయాణం చేసే రైళ్లకు బోర్డుకు ప్రతిపాదనలు చేయాలని, శ్రీకాకుళం నుంచి రాజమండ్రి, కాకినాడకు లోకల్ రైళ్లను నడపాలని, నాగపూర్–బిలాస్‌పూర్, విశాఖదుర్గ్ వందే భారత్‌కు డిమాండ్ లేనందున విశాఖ నాగపూర్‌కు నేరుగా రైలు నడపాలని కోరారు. వందే భారత్ రైళ్ల కోసం దువ్వాడ, సింహాచలం వద్ద సబర్బన్ హాల్ట్‌కు ప్రతిపాదనలు పంపాలని, తిరుపతి– విశాఖ డబల్ డెక్కర్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు సీటింగ్ కోచ్‌లు స్థానంలో 2ఏసీ, 3ఏసీ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేసి ర్యాకులను పెంచాలని ప్రతిపాదించారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్ట్ జోరు

- పట్టణం, గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- కూటమి నాయకుల కనుసన్నల్లో సాగుతున్న వైనం
- గ్రామాల్లో యథేచ్ఛగా రూ.లక్షల్లో వేలంపాటలు!
- నేరుగా లైసెన్స్ దుకాణాల నుంచే సరఫరా



పెందుర్తి పట్టణంలో ఓ బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం

గ్రామీణం, పట్టణం అన్న తేడా లేదు. బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోంది. అది నాణ్యమైన మద్యమో.. కల్తీ మద్యమో కూడా తెలియనంతగా.. కూటమి నేతల కనుసన్నల్లో జోరుగా వ్యాపారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో నిర్ణీత సమయం దాటితే మద్యం విక్రయాలకు బ్రేక్ పడేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వేళాపాలా లేదు. అక్కడా ఇక్కడా అన్న తేడాలేదు. ఎక్కడ పడితే అక్కడ.. ఎప్పుడు పడితే అప్పుడు విచ్చలవిడి విక్రయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మద్యం బెల్ట్ షాపులు నిలుస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ.. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, అటువైపు కన్నెత్తి చూడట్లేదన్న ఆరోపణలు మూటగట్టుకుంటోంది.



మండలాల వారీగా బెల్ట్ దుకాణాలు (అంచనా)
పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో పంచాయతీలు 15. గ్రామాలు 33
బెల్ట్ దుకాణాల సంఖ్య : దాదాపు 80
పట్టణ ప్రాంతంలో : దాదాపు 250
సబ్బవరంలో : పంచాయతీలు 24. గ్రామాలు 60
బెల్ట్ దుకాణాల సంఖ్య : దాదాపు 120
పరవాడలో : పంచాయతీలు 14. గ్రామాలు 35
బెల్ట్ దుకాణాలు : దాదాపు 60

పెందుర్తి: మద్యం బెల్ట్ దుకాణాల జోరు మరింత పెరిగింది. పట్టణం, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం సరఫరా అవుతోంది. కూటమి ప్రభుత్వం నిరంతరం మందుబాబులకు కిక్ ఎక్కిస్తోంది. పాత మద్యం పాలసీ(ప్రభుత్వ దుకాణాలు)ని రద్దు చేసి ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టింది. అంతే ఇప్పుడు నియోజకవర్గంలో మద్యం బెల్ట్ దుకాణాలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రోజు రోజుకూ పెరుగుతున్నాయి. స్వయంగా కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఆయా దుకాణాలు వెలుస్తున్నాయి. ఫలితంగా జనావాసాల్లో బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం ఏరులై పారుతోంది.

గ్రామానికి రెండు మూడు..!

నియోజకవర్గ కేంద్రం పెందుర్తి, గ్రామీణ ప్రాంతం సబ్బవరం, పారిశ్రామిక ప్రాంతం పరవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. దాదాపు ప్రతి గ్రామంలోనూ రెండు మూడు దుకాణాలు నడుస్తున్నాయి. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతంలో తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే క్రమంలో ప్రధాన దుకాణదారులే బెల్ట్ దుకాణాలకు స్వయంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇందుకు నేరుగా దుకాణదారులే రంగంలోకి దిగి గ్రామాల్లో వేలం పాటల ద్వారా బెల్ట్ దుకాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ తరహా బెల్ట్ వ్యాపారం సిండికేట్ ప్రధాన దుకాణాలకు అనుసంధానంగా జరుగుతుండడం గమనార్హం. బెల్ట్ దుకాణాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు 'మామూళ్ల'గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

వారిదే ఇష్టారాజ్యం

మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాక బెల్ట్ దుకాణాలకు మార్గం సుగమమైంది. లైసెన్స్ దుకాణాలు దాదాపు 90 శాతం కూటమి నాయకుల చేతిలోనే ఉండడంతో బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా, అమ్మకాలకు ఇబ్బంది లేకుండా పోయింది. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి యథేచ్ఛగా బెల్ట్‌ను ప్రోత్సహిస్తున్నారు. దుకాణాల్లో మద్యం సేల్ పెరగాలంటే బెల్ట్ దుకాణాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది వారి వ్యాపార సూత్రం. ఫలితంగా గ్రామాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయి. చివరకు బెల్ట్ దుకాణాల వద్ద గొడవలు చినికిచినికి గాలివానగా మారి హత్యాయత్నాలకు దారి తీస్తున్నాయని ప్రజలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి 'బెల్ట్' తీయాలని కోరుతున్నారు.



ఇటీవల పోలీసుల కార్డన్ సెర్చ్‌లో ఓ కాలనీలోని బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం

'బెల్ట్' తీస్తాం..



లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి. బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తే ఇచ్ఛితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్ దుకాణాలపై దాడులు విస్తృతంగా చేస్తున్నాం. బెల్ట్ దుకాణాలపై ప్రజలు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. బెల్ట్ నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. కార్డెన్ సెర్చ్‌లో కూడా ఆయా దుకాణాలపై దృష్టి సారిస్తున్నాం.

– కేవీ సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి లా అండ్ ఆర్డర్

ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు



మాట్లాడుతున్న ఎంఈవో–2 రవీంద్రబాబు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవంలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు పద్య పఠన, పాటలు, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, క్విజ్, బుర్రకథ, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి ఎంఈవో–2 జె.రవీంద్రబాబు చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలక్ష్మి, కామేశ్వరి, శారదాప్రసాద్, అర్జున అప్పారావు, అబ్బాయి దొర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నిమజ్జన ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



గణేష్ నిమజ్జనాలకు సిద్ధం చేసిన చెరువును పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

పెందుర్తి: వినాయక విగ్రహాల నిమజ్జనాలకు నిర్దేశించిన చెరువుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు జోన్–2 లా అండ్ ఆర్డర్ డీసీపీ మేరీ ప్రశాంతి సూచించారు. గురువారం రాత్రి పెందుర్తిలో నిమజ్జనం కోసం కేటాయించిన చెరువులను ఆమె సందర్శించారు. అక్కడ తీసుకుంటున్న భద్రత ఏర్పాట్లు సమీక్షించారు. భక్తులు కూడా పోలీసులకు సహకారం అందించాలని కోరారు. సీఐ కె.వి.సతీష్ కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల పేరిట భారీ దోపిడీ



బషీరాబాగ్ మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయు నాయకులు

పరవాడ: ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను మరింత దోపిడీ చేయాలని చూస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆరోపించారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 25 ఏళ్ల క్రితం పోరాటం చేస్తూ బషీరాబాగ్‌లో పోలీసు కాల్పుల్లో మరణించిన బాలస్వామి, సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డిల చిత్రపటాలకు లంకెలపాలెం కూడలిలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచారని ఆక్షేపించారు. దుకాణాలకు అమర్చిన స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అప్పారావు, గంగరాజు, వెంకటరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

భార్యాపిల్లల అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన శైలజ, పిల్లలు లిన్సి, రిషి

పెందుర్తి: భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు ఓ వ్యక్తి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ శాంతారావు మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలోని నాయుడుతోట బంటాకాలనీలో నివాసం ఉంటున్న ఉల్లాపు రత్నాకర్, శైలజ(26) భార్యభర్తలు. వీరికి లిన్సి(6), రిషి కుమార్(2) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే శైలజ పిల్లలిద్దరినీ తీసుకుని గత నెల 20న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితులు, తెలిసినవారి ఇళ్ల వద్ద ఆమె కోసం రత్నాకర్ ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో రత్నాకర్ పోలీసులను ఆశ్రయించాడని ఏఎస్‌ఐ తెలిపారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదృశ్యమైన మూడేళ్లకు ఆచూకీ లభ్యం



భార్య, కుమారుడిని భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ, ఆమె కుమారుడి కేసును పెందుర్తి పోలీసులు మూడేళ్ల తర్వాత ఛేదించారు. ఈ కేసు వివరాలను సీఐ కేవీ సతీష్ కుమార్ వెల్లడించారు. బోరాడ సంతోష్, అతని భార్య నాగమణి, కుమారుడు నివాస్ పెందుర్తి పాపయ్యరాజుపాలెంలో నివసించేవారు. తరుచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. 2022 ఫిబ్రవరి 10న నాగమణి తన కొడుకు నివాస్‌ను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. మరుసటి రోజు సంతోష్ ఈ విషయంపై పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాటి నుంచి పోలీసులు విస్తృతంగా గాలించారు. మూడేళ్ల తరువాత ఎట్టకేలకు పోలీసులు వారిని విశాఖలోని మద్దిలపాలెంలో గుర్తించారు. శుక్రవారం వారిద్దరినీ పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి భర్త సంతోష్‌కు అప్పగించారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



కుంభప్రోక్షణలో ప్రధాన కలశాన్ని, శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం ఘనంగా జరిపారు. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందిగామకు అప్పన్న ప్రచార రథం



రథాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటరమణ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఎన్టీఆర్ జిల్లా నందిగామకు శుక్రవారం తరలివెళ్లింది. నందిగామలోని వాసవి మార్కెట్‌లో జరుగుతున్న 43వ గణపతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా అప్పన్న ప్రచార రథాన్ని వారి అభ్యర్థన మేరకు అక్కడికి తరలిస్తున్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి రథం తరలింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

లక్ష్మీగణపతి ఆలయ ప్రారంభం



ఎస్ఎస్ఎఫ్ పరిశ్రమలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయం



వినాయకుడి పూజలో పాల్గొన్న పరిశ్రమ సీఎండీ కుమరేశన్ రాజేంద్రన్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిశ్రమ సీఎండీ కుమరేశన్ రాజేంద్రన్ ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ శిఖర కలశానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎంఏఎస్ఆర్ఎం, రాంకీ, సీఈటీపీ, ఐవోసీఎల్ సంస్థలకు చెందిన ప్రతినిధులు, ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చింతలేని 'సంత'



గొల్లలపాలెం సమీపంలోని పశువుల సంత

సంతలో విక్రయానికి ఉంచిన ఎండు చేపలు

ఆవులను బేరం చేస్తున్న దళారులు, కొనుగోలుదారులు

పశువుల కోసం సిద్ధంగా ఉన్న ముక్కుతాళ్లు, తాళ్లు

పల్లెలకు వన్నె తెచ్చేవి వారపు సంతలు. ఎన్ని రైతుబజార్‌లు.. సూపర్ బజార్‌లు వచ్చినా గ్రామాల్లో నిర్వహించే వారపు సంతల క్రేజే వేరంటే అతిశయోక్తి కాదు. విశాఖ–విజయనగరం సరిహద్దులోని పెందుర్తి మండలం గొల్లలపాలెం సమీపంలో జరిగే సంత మరింత సందడిగా ఉంటుంది. నిత్యావసర సరకులు ఇక్కడ అందుబాటు ధరలకే లభిస్తాయి. అంతకు మించి రైతులు కల్లాల్లో పెంచుకునే పశువుల సందడి అదనం. మాంసాహార ప్రియులకు సంత కేరాఫ్ అడ్రస్. పల్లెల్లో సర్వసాధారణంగా కనిపించే ఎండు చేపలు, రొయ్యలు ఇక్కడ విరివిగా లభిస్తాయి. ఓ వైపు రైతులకు మేలు జరిగేందుకు... మరోవైపు వినియోగదారులకు భారం కాని ప్రాంతం సంత. తాజా తాజా కాయగూరలు, ఆకుకూరలకు పెట్టింది పేరు 'సంత'. అందుకే సంత పల్లె ప్రజల జీవనానికి చింత లేని చిరునామా.

– పెందుర్తి

సామూహిక కుంకుమార్చనలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమార్చన పెద్ద ఎత్తున నిర్వహించారు. మహిళలు విశేషంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన ఆచరించారు. మహిళలందరిని గణపతి మండపం వద్ద వరుసగా ఆశీనుల్ని చేశారు. విఘ్నేశ్వరపూజ, లక్ష్మీసహస్రనామార్చన ఘనంగా నిర్వహించి, విశేషం హారతులందించారు. పసుపు కుంకుమలు, పూజాసామగ్రిని కమిటీ సభ్యులు ఉచితంగా ఏర్పాటు చేశారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు





ప్రదక్షిణ చేస్తున్న భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు, కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న టీటీడీ బోర్డు సభ్యుడు ఆనందసాయి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు బి.ఆనందసాయి దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట స్వామికి అర్చకులు అష్టోత్తరశతనామావళి పూజ జరిపి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటంలను ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.